


పకడ్బందీగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఒ గణపతిరావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం డిఆర్ఒ ఛాంబర్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల రెండో తేది నుంచి పదో తేదీ వరకు జరిగే టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 33 కేంద్రాల్లో 5610 మంది విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. పరీక్షల నిర్వహణకు ఎక్కడా ఇబ్బంది లేకుండా అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ పరీక్షల తనిఖీల కోసం 3 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు ఉండేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి లింగేశ్వర రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ రేవతిదేవి రాజీనామా

జూన్ 8న ఎన్నిక : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఇసరపు రేవతిదేవి

నగర డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతిదేవి తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను మేయర్ వెంపడాపు విజయలక్ష్మికి అందజేయగా, ఆమె ఆమోదించినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ నెల 8న నగర డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని.. జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. 2021 ఆగస్టు నాలుగో తేదిన నగర డిప్యూటీ మేయర్-1గా ఇసరపు రేవతిదేవి ఎన్నికయ్యారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో డిప్యూటీ మేయర్-1 ఎన్నికను నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

కాలువ ఆక్రమణలపై ఉపేక్షించేది లేదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాలువల ఆక్రమణల పట్ల ఉపేక్షించబోమని కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములునాయుడు హెచ్చరించారు. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కన కాలువపై ప్రాంతాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. అనంతరం కాలవలో పూడికను తీయించి కాలువ నీరు ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని కాలువలను ఆక్రమించి దుకాణాలు గానీ, ఇతర వ్యాపారాలు గాని సాగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దీనివల్ల కాలువల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి మురుగునీరు ప్రవాహానికి అడ్డంకిగా మారుతుందన్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరీ తీవ్రంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ పద్మ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీడి రైతు కుదేలు



- తగ్గిన దిగుబడి
- గిట్టుబాటు కాని ధర
- పట్టించుకోని ప్రభుత్వం
- ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దేశ విదేశాల్లో ఎంతో డిమాండ్ కలిగిన జీడి పిక్కలకు గిట్టుబాటు ధర రావడం లేదు. దీనికితోడు దిగుబడీ స్వలంగా తగ్గింది. ఫలితంగా పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీడికి శ్రీకాకుళం జిల్లా పెట్టింది పేరు. దానికి ఆనుకుని ఉన్న పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో సాగవుతున్న జీడికీ అంతే గిరాకీ ఉంది. పార్వతీపురం జిల్లాలో 68,137 ఎకరాల్లో, విజయనగరం జిల్లాలో 15,250 ఎకరాల్లో జీడి సాగవుతోంది. ఎకరాకు కనీసం రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఇక్కడ సాగవుతున్న వేల టన్నుల జీడి పిక్కలను వ్యాపారులు కొనుగోలు చేసి, ప్రాసెసింగ్ అనంతరం జీడి పప్పును విదేశాలకు పంపుతున్నారు. కాస్త నాణ్యత ఉండడంతో మంచి డిమాండే ఉండేది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడంతో పూత, పిందె ఆశాజనకంగానే కనిపించాయి. తిత్లీ తుపాను నుంచి వరుస నష్టాల పాలవుతున్న జీడి రైతులు ఈ ఏడాదైనా కాస్త అప్పుల నుంచి గట్టెక్కుతామని భావించారు. కానీ, సరిగ్గా పిందె దశలో అధిక వర్షాలు కురవడంతో కొంత నష్టం జరిగింది. గతంలో ఎకరాకు 200 కిలోల జీడిపప్పు దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది 150 కిలోలు మాత్రమే వచ్చిందని ఎక్కువ మంది రైతులతోపాటు అధికారులూ చెబుతున్నారు. మరో వైపు ధర చూస్తే కొనబోతే కొరవి, అమ్మబోతే అడవి అన్నట్టుగా ఉంది. ప్రస్తుతం నాణ్యతను బట్టి కేజీ జీడిపప్పు ధర రూ.600 నుంచి రూ.800 వరకు ఉంది. ఈ లెక్కన 80 కిలోల జీడిపప్పు బస్తా రూ.48 వేల నుంచి రూ.64 వేల వరకు పలుకుతోంది. రైతులు విక్రయించే జీడిపిక్కలను ప్రాసెసింగ్ చేసే క్రమంలో మూడు వంతులు తగ్గుతుందనుకున్నా 80 కిలోల జీడిపిక్కలకు కనీసం రూ.16 వేలైనా రైతుకు అందాలి. ఇదే లెక్కన ధర నిర్ణయించాలని కోరుతూ జీడి రైతులు ఆందోళన చేస్తున్నారు. కానీ అధికారులు జోక్యం చేసుకోడం లేదు. పాలకులు పట్టించుకోవడం లేదు. తాము అధికారంలోకి వస్తే జీడి రైతులకు మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పిన హామీని వైసిపి ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో 80 కిలోల బస్తా రూ.6 వేల నుంచి రూ.7 వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ఫలితంగా జీడి రైతులు నిలువు దోపిడీకి గురౌతున్నారు. కనీసం కిలో పిక్కలు రూ.100 కూడా పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీడి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



ర్యాలీ చేపడుతున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

ఎన్‌హెచ్-516బి మ్యాపు మార్చాలని

రైతుల ఆందోళన

ప్రజాశక్తి-కొత్తవలస

విశాఖపట్నం - అరకు జాతీయ రహదారికి కొత్తవలస మండలం గాంధీనగర్ మీదుగా వేస్తున్న జాతీయ రహదారి-516బి మ్యాపులను మార్చాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ముందుగా కొత్తవలస అంబేద్కర్ కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం సిఎస్ డిటి రమేష్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు మాట్లాడుతూ ఈ ప్రాంత భూములన్నీ జాతీయ రహదారులకు ఇస్తే చిన్న రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కొత్తవలస, ఎల్. కోట, వేపాడ, ఎస్.కోట మండలాల మీదుగా భూ సేకరణ అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలో మంగళపాలెం మీదుగా మిందివలస, కర్రిచిన్నయ్య పాలెం మీదుగా ఉత్తరాపల్లి జంక్షన్ వరకు రోడ్డు మ్యాప్ వేశారని, తక్షణమే రోడ్డు మ్యాప్ మార్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి మ్యాపు మార్చి రైతుల న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, రైతుసంఘం నాయకులు డేగల అప్పలరాజు, రైతులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

- రీ సర్వే ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలి
- విద్యాకానుక కిట్లను పంపిణీకి సిద్ధంగా ఉంచాలి : కలెక్టర్ నాగలక్ష్మి
- గుర్ల, చీపురుపల్లి మండలాల్లో విస్తృత పర్యటన

ప్రజాశక్తి-గుర్ల, చీపురుపల్లి

మనబడి నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేసి, పాఠశాలలను పునఃప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం గుర్ల, చీపురుపల్లి మండలాల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, సచివాలయాలను తనిఖీ చేశారు. ట్రెయినీ కలెక్టర్ ఎస్.వెంకట త్రివినాగ్, చీపురుపల్లి ఆర్‌డిఒ అప్పారావు, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

గుర్ల మండలం కెల్ల గ్రామం మెంటు చెరువులో ఉపాధి హామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. రెండుపూటలా పనిచేయలేకపోతున్నామని కూలీలు చెప్పగా, వేతనం ఎక్కువ రావాలంటే, రెండుపూటలా పనిచేయాల్సి ఉంటుందని కలెక్టర్ అన్నారు. హౌసింగ్ బిల్లులు పడలేదని, జగనన్న కాలనీలో పట్టాలు ఇవ్వలేదని స్థానికులు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను కలెక్టర్ పరిశీలించారు. టాయిలెట్ల నిర్మాణం, కిచెన్ షెడ్‌ను తనిఖీ చేశారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పదోతరగతి ఫెయిలైన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. గుర్ల గ్రామ సరిహద్దుల్లో చేపడుతున్న రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రోజుకు సుమారు 20 ఎకరాలకు తక్కువ కాకుండా సర్వే చేయాలని సూచించారు. గూడెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని కలెక్టర్ సందర్శించారు. నిర్మాణంలో ఉన్న, పూర్తి చేసిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో, స్థానిక నాయకులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపుపై ఆరా తీశారు. అన్ని ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని కోరారు. చోడవరం సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న గృహనిర్మాణం, ఇకెవైసి నమోదు, విత్తన సంసిద్ధత, నాడు-నేడు, తదితర కార్యక్రమాలపై సిబ్బందిని ప్రశ్నించారు. చీపురుపల్లి పట్టణ పరిధిలోని ఆంజేయపురంలో నిర్మాణంలో ఉన్న నాలుగో నంబరు సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఎన్నిరోజుల్లోగా భవనం పూర్తి చేస్తారని సిబ్బందిని ప్రశ్నించారు. ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణంపై ఆరా తీశారు. రెడ్డిపేటలో సుమారు రూ.2లక్షల వ్యయంతో మంజూరు చేసిన సిమ్మెంటు డ్రెయిను నిర్మాణాన్ని పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని, పని పూర్తయిన నాలుగు రోజుల్లోనే బిల్లులు జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. విజయరాంపురం ప్రాథమిక, చీపురుపల్లి ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. మండల స్థాయి స్టాక్ పాయింట్లో భద్రపరిచిన విద్యాకానుక కిట్లను, పుస్తకాలను, ఇతర సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలల వారీగా కిట్లను సిద్ధం చేస్తే, పంపిణీ సులువుగా పూర్తి అవుతుందని సూచించారు. చీపురుపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రీసర్వే వెక్టరైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.



నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కార్యక్రమంలో డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, డిఎల్‌డిఒ లక్ష్మణ్, ఎంపిడిఒలు కళ్యాణి, రామకృష్ణరాజు, తహశీల్దార్లు సూర్య, సురేష్, గుర్ల ఎపిఒ హరనాథ్, ఎంఇఒలు భానుప్రకాశ్, హౌసింగ్ డిఇ శంకర్రావు, ఎఇ శ్రీనివాసరావు, డిఐఒఎస్ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు'పై కలెక్టర్ సమీక్ష

విజయనగరం : కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంఇఒలు, డిఇలు, ఎఇలతో నాడు-నేడు పనుల పురోగతిపై బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి మండలాల వారీగా సమీక్షించారు. గత సమీక్ష 15 రోజుల క్రితం జరిగిందని, ఈ కాలంలో కొన్ని మండలాల్లో ఎలాంటి పురోగతీ కనపడలేదని, ఇలాగే ఉంటే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సిబ్బంది లేరని, సిమెంట్ లేదని కథలు చెప్పొద్దన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తిచేయాలని, ఎంఇఒలు ఈ పది రోజుల్లో అన్ని పాఠశాలలను సందర్శించి పనుల తీరుపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. పాఠశాలల ప్రారంభం తర్వాత విద్యార్థుల నమోదు, రోజు వారీ హాజరు పరిశీలిస్తానని, హాజరు కచ్చితంగా ఉండాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత తప్పనిసరిగా పాటించాలని, తనిఖీల్లో తాను కూడా భోజనం చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ వెంకట త్రివినాగ్ , డిఇఒ లింగేశ్వర రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-రాజాం



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు

ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రామ్మూర్తి నాయుడు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగుల సంఘం చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బుధవారం ఆయన సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన వేతనాలు ఇవ్వాలని కోరారు.

11వ పిఆర్‌సి అమల్లో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలలో భాగంగా ఆర్థికపరమైన బకాయిలను, డిఎ ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగరాజు, రాజు, హరి, అప్పలరాజు, శారద, ప్రసన్న లక్ష్మి, సోమేష్, దాస్, తదితరులు పాల్గొన్నారు.

2.58 లక్షల మందికి రైతుభరోసా

నేడు బొబ్బిలిలో సాయం విడుదల చేయనున్న మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో 2.58 లక్షల మంది రైతులకు వైఎస్ఆర్ రైతుభరోసా - పిఎం కిసాన్ పథకం సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గురువారం జిల్లా స్థాయిలో బొబ్బిలి ఎంపిడిఒ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా రైతాంగానికి రైతుభరోసా సహాయం విడుదల చేయనున్నారు. రైతుభరోసా తొలివిడత సహాయం కింద జిల్లాలో ఒక్కో రైతుకు రూ.7500 వంతున 2,58,324 మందికి రూ.193.743 కోట్ల మొత్తాన్ని గురువారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఇందులో 2,55,147 మంది భూయజమానులతో పాటు 1,115 మంది అటవీ భూమి సాగుదారులు, 2,062 మంది కౌలురైతులు ఉన్నారు.

పెట్టుబడి రాయితీ కూడా..

జిల్లాలో అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతాంగానికి కూడా ముఖ్యమంత్రి పెట్టుబడి రాయితీ విడుదల చేస్తున్నారు. జిల్లాలో 989.37 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందని అందిన నివేదికల మేరకు జిల్లాలోని పది మండలాల్లోని 1595 మంది రైతులకు రూ.49.469 లక్షలు పెట్టుబడి రాయితీగా అందించనున్నారు. మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ.5 వేలు చొప్పున పెట్టుబడి రాయితీని ప్రభుత్వం మంజూరు చేసింది.



విత్తన విక్రయాలను ప్రారంభిస్తున్న డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన

అన్నదాతలకు అండగా డిసిఎంఎస్ సేవలు

చైర్‌పర్సన్ అవనాపు భావన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఖరీఫ్ సీజన్‌కు ముందునుంచే వరి విత్తనాల విక్రయం ప్రారంభించామని డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన తెలిపారు. విజయనగరంలోని డిసిఎంఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం వరి, మొక్కజొన్న విత్తనాల విక్రయాన్ని ఆమె ప్రారంభించారు. వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్ విత్తనాలను ప్రథమంగా కొనుగోలు చేశారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన లేపాక్షి నోట్స్ పుస్తకాల విక్రయాలను కూడా భావన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం మార్కెట్ కంటే తక్కువ ధరలో నాణ్యమైన ఎంటియు 1121, సోనా మసూరి, సాంబమసూరి, ఫౌండేషన్ వరి విత్తనాలను, పయొనీర్ మొక్కజొన్న విత్తనాల విక్రయాలను డిసిఎంఎస్ లో ప్రారంభించామన్నారు. గతేడాది విత్తనాలను వినియోగించిన రైతులు దిగుబడి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో కోరుకొండ మాజీ సర్పంచ్ లాగుడు శివాజీ, డిసిఎంఎస్ డైరెక్టర్ ఎస్.సన్యాసినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కృష్ణ, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ సాయి కుమార్, డిసిఎంఎస్ సిబ్బంది రమేష్, రాఘవులు, సూరప్పుడు, సీతారామ్, రాజు, వెంకటరావు, పద్మ, వైసిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండండి

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని బృందా కేన్సర్ క్లినిక్ వైద్యులు వంశీధర్ కోరారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక గంటస్తంభం నుంచి కోట వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వంశీదర్ మాట్లాడుతూ ధూమపానం దుష్ప్రభావం 15 ఏళ్ల వరకు శరీరంలో ఉంటుందన్నారు. ఓరల్, ఊపిరితిత్తుల కేన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు గెద్ద చిరంజీవి, సభ్యులు వి.గౌరినాయుడు, కోశాధికారి ఉమాశంకర్ గుప్త, జి.అప్పారావు మహిళా ప్రాక్టీసనర్స్ ఝాన్సీ, భవాని తదితరులు పాల్గొన్నారు

సీతంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

సీతం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రభ కోన మాట్లాడుతూ ప్యాసివ్ స్మోకింగ్ వల్ల చాలా మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను, పొగాకు మానేయడానికి కొన్ని చర్యలను ఆమె వివరించారు. డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ పొగాకు వాడకాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం మందులు అందిస్తోందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ పొగాకు పంటను ఎవరూ పెంచవద్దని, వాడవద్దని, రవాణా చేయవద్దని, వినియోగించవద్దని కోరారు. సీతమ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, విద్యార్థులు పొగాకుకు దూరంగా ఉండాలని, పొగాకు ఉత్పత్తులకు బానిసలు కాకూడదని సూచించారు. విద్యార్థులంతా పొగాకు నియంత్రణ, నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ముఖ్య అతిథులను సీతం యాజమాన్యం సత్కరించింది.



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు, బృందా కేన్సర్ క్లినిక్ సిబ్బంది



సంతకాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికులను

రెగ్యులరైజ్ చేయాలి

- సిఐటియు ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ
- నేడు విజయనగరానికి రాష్ట్ర జాతా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ డిమాండ్ చేశారు. బుధవారం గాజులరేగలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై బుధవారం ఇచ్ఛాపురంలో ప్రారంభమైన రాష్ట్ర జాతా గురువారం విజయనగరం చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు నెహ్రూ పార్కు పాలాస్పత్రి వద్ద జరిగే సభకు కార్మికులు తరలిరావాలని కోరారు. అనంతరం కంటోన్మెంట్, స్టేడియంపేట, జొన్నగుడ్డి, హుకుంపేట, బుంగ వీధి, కొత్తపేటలో రాష్ట్ర శాతాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఎన్.పైడిరాజు, బి.భాస్కర్‌రావు, తిరుమలరావు, పైడిరాజు, రావు, బి.కృష్ణ, ఆదినారాయణ, కుమారి, రమ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆక్రమణలను తొలగించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో రోడ్లు, కాలువలు ఆక్రమణలకు గురవ్వడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ జి.రమాదేవి, టిడిపి ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు కోరారు. కౌన్సిల్ హాల్లో బుధవారం మున్సిపల్ ఛైర్మన్ సావు మురళి కృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ జి.రమాదేవి మాట్లాడుతూ మేధరవీధి, బొప్పడాపువీధి, యాతవీధి, గొల్లవీధి రోడ్లుపై కాలువలు ఆక్రమించేసి షాపులు, బడ్డీలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. షాపులు, బడ్డీలు పెట్టినా కౌన్సిలర్లకు చెప్పడం లేదన్నారు. ఆక్రమణలను తొలగించాలని కోరారు. టిడిపి ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ బజారు, ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ సావు మురళి కమిషనర్ శ్రీనివాసరావు, టిపిఒ వరప్రసాద్‌ను ఆదేశించారు. టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ మాట్లాడుతూ అమ్మిగారి కోనేరుగట్టుపై పేదలు ఇల్లు నిర్మించుకుంటే ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. పట్టణంలో అన్ని చెరువు గట్లు ఆక్రమణకు గురవుతున్నాయని, అమ్మిగారి కోనేరుగట్టుపై నిర్మాణాలు అడ్డుకోవడం పేదలపై కక్షసాధింపునకు పాల్పడడమేనని అన్నారు. అన్ని గట్లుపై ఆక్రమణలను తొలగించాలని కోరారు. పేదలు ఇల్లు నిర్మించకపోతే పట్టాలు రద్దు చేస్తామని పేదలను బెదిరించడం అన్యాయమన్నారు. గొల్లపల్లిలో సామూహిక మరుగుదొడ్లు బాగు చేయాలని పదో వార్డు కౌన్సిలర్ కాకల గోవిందమ్మ కోరారు. స్మశాన వాటిక బాగు చేయాలని ఐదో వార్డు కౌన్సిలర్ వి.హైమవతి కోరగా జనరల్ ఫండ్ కేటాయించి బాగు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు



అధికారులను ప్రశ్నిస్తున్న మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ జి.రమాదేవి

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని కొత్తూరు గ్రామ రెవెన్యూ పరిధిలో రైతు భరోసా కేంద్రం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమించి పాక నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో కొత్తూరు గ్రామస్తులు బుధవారం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మద్దిల రమణ మాట్లాడుతూ కొత్తూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వస్థలాలను గ్రామానికి చెందిన రొప్పల అప్పలకొండ మరి కొందరు ఆక్రమించి కమ్మలపాక ఇల్లులు నిర్మించారన్నారు. వీరికి కొత్తూరు పాత ఎస్‌సి కాలనీలో 2007లో ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇచ్చిందని ఆ స్థలాలు నిర్మాణం కూడా చేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ రైతు భరోసా కేంద్రం పక్కన గ్రామంలో ఉన్న కొంతమంది పేదలకు వైయస్సార్ కాలనీ కింద ఇల్లు స్థలాలు ఇవ్వగా మిగిలిన స్థలంలో వీరు అక్రమంగా స్థలాన్ని ఆక్రమించి పూరి పాకలు నిర్మించారని ఈ అక్రమాలపై గత రెండు నెలల కితం ఫిర్యాదు చేసినప్పటికీ తహశీల్దార్, విఆర్‌ఒ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వస్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై దర్యాప్తు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్



విచారణ చేపడుతున్న అధికారులు

మండలంలోని దిబ్బగుడ్డి వలస గ్రామంలో ఉపాధి హామీలో జరిగిన అక్రమాలపై బుధవారం స్థానిక సచివాలయంలో ఉపాధి హామీ ఎపిడి జగన్నాధరావు దర్యాప్తు నిర్వహించారు. గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన డబ్బులిస్తేనే జాబ్ కార్డు కథనానికి స్పందించిన డ్వామా పీడీ క్షేత్రసహాయకురాలిపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. దీనిపై బుధవారం దర్యాప్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడి ఫిర్యాదు దారునితో, ప్రజాశక్తికి తెలియజేసిన సిహెచ్‌లం, కృష్ణలతోను, ఇతర కూలీలతోను మాట్లాడి వాస్తవాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతూ దర్యాప్తు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ దర్యాప్తులో ఎపిఒ జనార్దనరావు, జెఇ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజా కళాశాల విద్యార్థుల ప్రతిభ

బొబ్బిలి: స్థానిక రాజా ఆర్ఎస్ఆర్‌కె రంగారావు కళాశాలకి చెందిన 56 మంది విద్యార్థులకు ఐసిఐసిఐ, హెటిరో లాబొరేటరీస్ సంస్థలు జరిపిన ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు సంపాదించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్ర కుమార్ తెలిపారు. మే 26,29వ తేదీల్లో జరిగిన ప్రాంగణ నియామకాల్లో బొబ్బిలి పరిసర ప్రాంతాలలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు హాజరు కాగా 61 మంది ఉద్యోగాలు సంపాదించారన్నారు. అందులో అత్యధికంగా 56 మంది రాజా కళాశాలకి చెందిన వారేనని చెప్పారు. ఇందుకు కళాశాల ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎన్. శరత్ కుమార్ అందిస్తున్న శిక్షణ, ప్రమాణాలే కారణమని చెప్పారు. ఉద్యోగాలు సంపాదించిన విద్యార్థినీ విద్యార్థులకు, ప్లేస్మెంట్ ఆఫీసర్‌కు, కళాశాల ఛైర్మన్ ఆర్‌వి సుజయ్ కృష్ణ రంగారావు, జాయింట్ సెక్రటరీ ఆర్ బదరి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పొగాకు నిషేధంపై అవగాహన

బొబ్బిలి: ప్రపంచ పొగాకు నిషేధ దినోత్సవం సందర్భంగా బ్రహ్మ కుమారీస్ సభ్యులు పట్టణంలో గల కళాసీలకు, భవన నిర్మాణ కార్మికులకు, ఆటో డ్రైవర్లకు పొగాకు నిషేధం పై బుధవారం అవగాహన కల్పించారు. పొగాకు నిషేదం వల్ల కలిగే లాభాలను గురించి వివరించారు. రాజయోగం ద్వారా వ్యసనాలను తొలగించుకునే మానసిక శక్తి లభిస్తుందని, అందరూ ఉచితంగా రాజయోగ మెడిటేషన్ నేర్చుకోవాలని బ్రహ్మకుమారీస్ బికె.రాజేశ్వరి సూచించారు. అనంతరం పలు నినాదాలు చేశారు.

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

గుర్ల: నవధాన్యాలు సాగు వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి జి హేమసుందరరావు అన్నారు. బుధవారం మండల వ్యవసాయ కార్యాలయంలో విఎఎ, విహెచ్ఎలకు మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్షలు, విత్తనాభివృద్ధి, వైఎస్ఆర్ పొలం బడి ఇతర పథకాల పై విస్తృత అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి మాట్లడుతూ నవధాన్యలు సాగు వల్ల భూసారం వృద్ధి, సేంద్రియ కార్బన్ శాతం పెరగడంతో రసాయన ఎరువులు వాడకం తగ్గుతుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనిచాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికెల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

డెంకాడ: స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న సాయికృష్ణ రైతు మిత్ర గ్రూప్ విత్తనాలు, పురుగు మందుల షాప్, శ్రీగంగమాంబ ఫెర్టిలైజర్స్‌ను బుధవారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి. సింహాచలం, ఎఒ నిర్మల తనికీలు చేశారు. ప్రస్తుతానికి సదరు షాప్‌ల్లో ఈ ఏడాదికి సంబందించిన ఎటువంటి విత్తనాల నిల్వలు, వ్యత్యాసము లేదని గుర్తించామన్నారు. రానున్న ఖరీఫ్ కాలంలో విత్తనాల అమ్మకాల్లో ఎటువంటి అక్రమాలు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయించాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

చంద్రబాబును కలిసిన కోళ్ల



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కోళ్ల

శృంగవరపుకోట: టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును విశాఖపట్నం ఎయిర్ పోర్టులో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ మేరకు చంద్రబాబు విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు కుమారుని వివాహానికి, యలమంచిలి నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగాఢ నాగేశ్వరరావు స్వగృహానికి, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు బొట్ట వెంకటరమణ కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వంగలపూడి అనిత, టిడిని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధి కుళాయిల్లో నురగ నీరు



నురగ నీరు

శృంగవరపుకోట: పట్టణంలోని శ్రీనివాస కాలనీలో గత మూడు రోజులుగా వీధి కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా కావడం లేదు. వేసవి కాలంలో మంచినీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు అసహనంతో ఉన్న సమయంలో బుధవారం ఒక్కసారిగా కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. అయితే కుళాయిల ద్వారా వచ్చే నీరు నురగతో ఉండటంతో ఒక్క బిందె కూడా వినియోగించడానికి పనికిరాలేదు. దీంతో మహిళలు ఆందోళణ వ్యక్తం చేశారు. ప్రజలకు మంచినీటిని సరఫరా చేయటంలో అధికారులకు చెత్తశుద్ధి లేదని పలువురు వాపోతున్నారు. మూడు రోజులు తర్వాత వచ్చిన వీధి కుళాయిల నీరు సర్ఫ్ నురగతో కూడిన నీరులా రావడం అధికారులు వెంటనే నీటి సరఫరాలో లోపాలను సరిచేసి ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

షాపుల వేలం వాయిదా

విజయనగరం టౌన్: స్థానిక రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న షాపుల బహిరంగ వేలం వాయిదా వేసినట్లు కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని తొలుత ప్రకటించారు. కానీ బుధవారం నిర్వహించిన వేలం పాటకు సరైన స్పందన లేకపోవడంతో వేలం వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. తదుపరి జరిగే వేలం వివరాలను త్వరలో తెలియజేస్తామని చెప్పారు.

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రభావతి

విజయనగరం టౌన్: కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జిల్లాకు చెందిన కె.వి.ప్రభావతి ఎన్నికయ్యారు. రావులపాలెంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఆమెకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు డి.రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్ష్మణరావు, ప్రసాద్, ఈశ్వర్‌రావు అభినందనలు తెలియజేశారు.

నేరాలు ఘోరాలు

తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య

బాడంగి : మండలంలో ఆకులకట్ట గ్రామానికి చెందిన మేకల భవాని (15) 10వ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేదని, సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు కట్టి చదవటం లేదని తన తల్లి మందలించిందని గత నెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. కొంత సమయానికి కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కొరకు బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి విజయనగరం, అక్కడి నుంచి విశాఖ కేజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృఇత చెందినట్లు మృతురాలి తాత మేకల సీతయ్య ఫిర్యాదు మేరకు బాడంగి ఎస్ఐ ఆర్. జయంతి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.


మద్యం సీసాలు స్వాధీనం

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన సుగ్గు సత్యనారాయణ దగ్గర అక్రమంగా ఉన్న 15 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసికొన్నట్లు ఎస్ఐ కొండలరావు బుధవారం తెలిపారు. తమకున్న ముందస్తు సమాచారం మేరకు మార్గం మధ్యలో సిబ్బందితో కలిసి పట్టుకొన్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధి పనులకే ప్రాధాన్యం: జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి - జామి

అభివృద్ధి పనులే ప్రాధాన్యం అన్న సంకల్పంతో వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని కలగాడ, అలమండ గ్రామాల్లో అభివృద్ధి పనులున ఆయన ప్రారంభించారు. లంచాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సిఎం వాలంటీర్ వ్యవస్థను తీసుకోచ్చారన్నారు. లాభాపేక్ష లేకుండా సేవే పరమావధిగా వాలంటీర్లు ముందుకు సాగుతున్నారని, ఎంత సేవ చేస్తున్నామనే భావన మాత్రమే వాలంటీర్లలో కనిపిస్తుందని ప్రశంసించారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా 33 రకాల సేవలను ప్రతీ ఇంటికి అందిస్తున్నామని చెప్పారు. కరోనా కష్టకాలంలో రాష్ట్రంలో ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ సమాచారాన్ని తెలుసుకుంటూ ఉన్నతాధికారులకు ఆ సమాచారాన్ని చేరవేస్తూ దేశంలోనే అత్యధిక కోవిడ్ టెస్ట్‌లు చేసిన రాష్ట్రంగా మన ఆంధ్ర రాష్ట్రాన్ని నిలిపిన ఘనత వాలంటీర్లకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, కొప్పులి వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కలి నాయుడుబాబు, ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, సూర్యనారాయణ రాజు, మండల వైసిపి కన్వీనర్ గొర్లె రవికుమార్, జిల్లా ప్రచార కమిటీ ఛైర్మన్ రాజేశ్వరరావు, మాజీ ఎంపిపి సూరిబాబు రాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, అలమండ సర్పంచ్ పాపమ్మ, వైస్ సర్పంచ్ లగుడు దేముడు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: వాలంటీర్లను సత్కరిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

భవిష్యత్తులో మరిన్ని సేవలు

డెంకాడ: భవిష్యత్తులో వాలంటీర్ల ద్వారా మరిన్ని సేవలు అందించనున్నామని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు అన్నారు. మండల కేంద్రంలో సింగవరం, నాతవలస, డెంకాడ వాలంటీర్లకు బుధవారం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ వల్ల ఇంటికే పథకాలు చేరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ రొంగలి కనకసింహాచలం, సర్పంచులు పతివాడ గౌరీ, అప్పారావు, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, నాయకులు బమ్మిడి వెంకటరమణ, ఉప సర్పంచ్ బావన గురునాథరావు, బావన శ్రీనివాసరావు, సంచాన కృష్ణమూర్తి, లెంక అప్పలనాయుడు, రొంగలి గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



డెంకాడ: వాలంటీర్‌ను సత్కరిస్తున్న ఎంపిపి, పిఎసిఎస్ ఛైర్మన్

వేపాడ: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వల్లంపూడి, వేపాడ, బానాది, బల్లంకి, ఎన్‌కెఆర్‌పురం, కొంపల్లి సచివాలయాల పరిధిలోని పనిచేస్తున్న వాలంటీర్లను సత్కరించారు. ఇందులో భాగంగా ఎంపిపి దొంగ సత్యవంతుడు ఉత్తమ వాలంటీర్లకు పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, డిసిసిబి ఛైర్మన్ వి.రామునాయుడు, ఎఎంసి ఛైర్‌పర్సన్ మూకల కస్తూరి, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరు జగన్నాథం, సర్పంచుల సంఘం అధ్యక్షులు నిరుజోగి వెంకట్రావు, పిఎసిఎస్ అధ్యక్షులు వేచలపు రామ్మూర్తి నాయుడు, జెసిఎస్ కన్వీనర్ భోజంకి శ్రీను, ఎంపిడిఒ పట్నాయక్, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉప్పాడ అనూష అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపిడిఒ డి. బంగారయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు మండల స్థాయి అధికారులంతా పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. గత సమావేశంలో వచ్చిన సమస్యలపై చేసిన పరిష్కార మార్గాలు తదితర అంశాలు పూర్తిస్థాయిలో సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

సంక్షేమం..అభివృద్ధి టిడిపికి రెండు కళ్లు : కంది

డెంకాడ: సంక్షేమం, అభివృద్ధి టిడిపికి రెండు కళ్లు లాంటివని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఓట్లేసి గెలిపించిన వైసిపి ప్రభుత్వం ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. టిడిపి అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ప్రజా సమస్యలు ప్రజాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఇటీవల జరిగిన మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో చూసి వైసిపి ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులు తనకా బెట్టి, అప్పులు చేసి అభివృద్ధిని మరిచి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామంటూ కళ్ళ బొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. చంద్రబాబు సంపదను సృష్టించి సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండింటిని రాష్ట్రంలో అమలుపరిచినట్లు గుర్తు చేశారు.

నేడు గొంప కృష్ణ జన్మదిన వేడుకలు : వెంకటరావు

వేపాడ : నియోజకవర్గం టిడిపి యువ నాయకులు గొంప కృష్ణ పుట్టిన రోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించనున్నామని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 43వ పుట్టిన రోజు వేడుకలను ఆర్‌కె కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బాధితులకు ఆర్థిక సాయం

రేగిడి: మండలంలోని పోరాం గ్రామ అగ్నిప్రమాద బాధితులకు జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఒక్కొక్కరికీ రూ.25వేలు చొప్పున రూ.75వేలు పంపిణీ చేశారు. ఈ నగదును ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ చేతులు మీదుగా బుధవారం బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్ట మహోత్సవాలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడ గ్రామంలో గురువారం నుంచి మూడు రోజులు పాటు రామాలయ ప్రతిష్ట మహోత్సవాలను నిర్వహించనున్నామని ఆలయ కమిటీ నిర్వాహుకులు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా తొలిరోజు ఉదయం 8గంటలకు గణపతి పూజతో ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం వేద స్వస్తితో ముగించనున్నారు. రెండో రోజు శుక్రవారం విఘ్నేశ్వరపూజ, మండప పూజలు, సుందరకాండ పారాయణ, సాయంత్రం పుష్పాదివాసం, శయ్యాదివాసం, నీరాజన మంత్రపుష్పాలు, వేద స్వస్తి నిర్వహించనున్నారు. ఆఖరి రోజు శనివారం పుణ్యాహవచనంతో ప్రారంభమై మధ్యాహ్నం మహాన్నదానం, విగ్రహలు ప్రతిష్ట, ఆలయం ప్రారంభం చేపట్టనున్నారు. ఈ మూడు రోజులు పాటు గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ రామాలయ ప్రతిష్ట ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతులు మీదుగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరవుతారని తెలిపారు.



డెంకాడ: ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రామాలయం

వైభవంగా ఆలయ ప్రతిష్ట

జామి: స్థానిక మాధవరాయమెట్ట వద్ద వైభవంగా రామాలయం ప్రతిష్ట బుధవారం జరిగింది. తొలుత విగ్రహ ప్రతిష్ట నిర్వహించిన పురోహితులు, అనంతరం సీతారాముల శాంతి కళ్యాణం చేశారు. ఈ సందర్భంగా కాలనీలో రెండు వేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ జెడ్‌పిటిసి బండారు పెద్దబాబు, స్థానిక కపిల్ కాంక్రీట్స్ అధినేత కోనేరు మురళి హాజరై సీతారాములకు పూజలు చేశారు. స్థానిక అడ్వకేట్ అల్లు సత్యాజీ హాజరుకాగా, శక్తి పీఠం గురువు భారతనంద మహారాజ్ హాజరై, ప్రజలతో మాట్లాడారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ కృష్ణ, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ సిహెచ్ నర్సింహారావు, దేవాలయ ఇంచార్జీ బొడసింగి అప్పలరాజు, స్థానిక ఆలయ కమిటీ సభ్యులు వి.కోటయ్య, పోలిరాజు, గౌరినాయుడు, రాము తదితరులు సహాయ సహకారాలు అందజేశారు.

ఘనంగా ప్రథమ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో శ్రీశ్రీశ్రీ షణ్ముఖ సహిత దుర్గా మల్లికార్జున స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పరిసర ప్రాంత గ్రామాలైన సింగవరం, పోతంపేట, బల్లంకి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాన్ని సర్పంచ్ కర్రి యశోద, ఎంపిటిసి గొంప తులసి, గొంప వెంకట్రావు, గల్లా రామచంద్రుడు మాస్టర్, గ్రామ ప్రజలు సహాయ సహకారాలతో నిర్వహించారు.



వేపాడ: అన్నదానంలో పాల్గొన్న మహిళలు

పలు నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- భోగాపురం

రూ.2 కోట్లతో నిర్మించిన పలు భవనాలను ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. మండలంలోని సవరవిల్లిలో రూ.79.30 లక్షలతో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించారు. చేపలకంచేరులో రూ. 25 లక్షలతో సచివాలయ భవనం, ముక్కాంలో రూ. 40లక్షలతో సచివాలయ భవనం, ముంజేరులో రూ 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, భోగాపురం చాకివలస రోడ్డు బస్సు షెల్టర్‌ను రూ.5 లక్షలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని 100శాతం నెరవేర్చామని అన్నారు. సుపారు పాలనను పల్లె ప్రజలకు చేరువు చేసామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో లింగలవలస పంచాయతీకి చెందిన 17 మందికి జగనన్న ఇల్లు పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, ఎంపిపి ఉప్పాడ అనూష, వైస్ ఎంపిపి రావాడ బాబు, హౌసింగ్, మత్స్యకార రాష్ట్ర డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, మైలపిల్లి నరిసింహులు, మండల జెసిఎస్ కన్వీనర్ బైరెడ్డి యర్రప్పలనారాయణ రెడ్డి, సర్పంచులు ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి, అరజల్ల నరిసింగ్ రావు, వాసుపల్లి ఎర్రయ్య మ్మ, పూడి నూకరాజు, బానుప్రకాష్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, కర్రోతు శ్రీనివాసరావు, కర్రోతు వెంకటరమణ, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ బంగారయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

స్పందన వినతులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్పందన వినతులు తక్షణమే పరిష్కరించాలని నగర పంచాయతి కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన జరజాపుపేట 2వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్నకు చెబుదాం (స్పందన) అనే కార్యక్రమాన్ని చేపట్టిందని ఇందులో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతీరోజూ అన్ని సచివాలయాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 5 వరకు తప్పనిసరిగా స్పందన నిర్వహించాలని తెలిపారు. సమయపాలన, యూనిఫాం, బైయో మెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ లీలా ప్రసాద్, వెల్‌ఫేర్ అసిస్టెంట్ బి. శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాద్

కల్వర్టులో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి

స్థానిక మొయిద జంక్షన్ వద్ద కల్వర్టు కింద పేరుకుపోయిన చెత్త వల్ల మురుగు నీరు రోడ్డు పైకి ప్రవహించి బాటసారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెత్తను తొలగించాలని కమిషనర్ బాలాజీ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ శిక్షణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను, పట్టణంలోని కేంబ్రిడ్జి నారాయణ పాఠశాలలోనూ గత నెల రోజులుగా జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాలు బుధవారంతో ముగిసాయని కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా నెల రోజుల్లో క్రీడాకారులు శిక్షణ శిబిరంలో నేర్చుకున్న విన్యాసాలు ప్రదర్శించడంతో పలువుర్ని ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లడుతూ చిన్నారులు తెల్ల కాగితం లాంటి వాళ్ళని, వాళ్ళని శ్రీరాములు మాస్టారు ఎంతో చక్కగా తీర్చిదిద్దారని, శ్రీరాములు ఎక్కడ ఉంటే అక్కడ ఒక క్రీడా ప్రపంచం తయారవుతుందని అన్నారు. క్రీడాకారులకు, వాళ్ల తల్లిదండ్రులకు ఇంతటితో ఈ బ్యాడ్మింటన్ శిక్షణ ఆపవద్దని, చదువుతోపాటు ఆటలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, ఆటల ప్రశంసా పత్రాల వల్ల అటు ఉన్నత చదువులకు ఇటు ఉద్యోగాలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్న దాతలందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ శ్రీరాములు, డాక్టర్ ఎస్‌వి సత్యశేఖర్, అట్లూరి వెంకట్రావు, మల్లా రామకృష్ణ షేక్ సిలార్, కె.జివిఎన్, మూర్తి, ఆనల రమేష్, ఆనల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ

గొంప కృష్ణ వెంటే యువత



లక్కవరపుకోట : మండలంలోని చందులూరు గ్రామాన్ని నియోజకవర్గ యువనే గొంప కృష్ణ ఇప్పటికే పలుమార్లు పర్యటించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో టిడిపిని బలోపేతం చేసేందుకు ఆయన చేస్తున్న కృషికి నాతో పాటు యువత ఆకర్శితులయ్యాం. మా గ్రామంలో కూడా పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఆయన నాయకత్వాన్ని బలపరచడంతోపాటు ప్రస్తుతం టిడిపికి కృష్ణ నాయకత్వం ఎంతైనా అవసరం. నాతోపాటు మా గ్రామంలో అధిక శాతం మంది యువకులు మహిళలు ఆయనకు బాసటగా నిలిచి టిడిపి విజయానికి కృషి చేస్తాం.

- జి.గణేష్, చందులూరు, ఎల్.కోట మండలం

సమస్య ఉంటే వెంటనే స్పందించే వ్యక్తి కృష్ణ



కొత్తవలస: టిడిపిలో చిన్న కార్యకర్తకైనా ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే స్పందించే గుణం ఉన్న యువ నాయకులు గొంప కృష్ణ, ఇటువంటి నాయకత్వ లక్షణం కలిగిన నాయకుడు మనకు ఎంతైనా అవసరం. కొత్తవలసలో ఎన్నడూ లేని విధంగా ప్రతి గ్రామం పర్యటించి సమస్యలు తెలుసుకుని ఆర్థికంగా వెనుక బడిన కుటుంబాలను ఆదుకున్నారు. ఆయన నాయకత్వాన్ని నమ్మడమే కాకుండా ఎస్ కోట నియోజకవర్గం శాసనసభ ఎన్నికల్లో టిడిపి విజయమే ప్రధాన ధ్యేయంగా ఆయనతో కలిసి పనిచేసేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నాం.

లెంక శ్రీను, టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, కొత్తవలస